క్లుప్తంగా

మొక్కలు పంపిణీ



విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న వెంకట సురేష్, తదితరులు

హిరమండలం: మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని స్థానిక వృద్ధాశ్రమ గౌరవ అధ్యక్షుడు అంధవరపు వెంకట సురేష్ అన్నారు. సత్యసాయిబాబా శత జయంతి వేడుల్లో భాగంగా ఆదివారం చిన్నకోరాడ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు, హెచ్ఎం గుడ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు కైవాడ గిరి, చంటి మాస్టారు, నరసింహమూర్తి, కేవీ రమణమూర్తి, యు.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి



సోమరాజపురం వద్ద నీటమునిగిన పంటను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: వంశధార వరద వల్ల నష్టపోయిన పంటలకు కూటమి ప్రభుత్వం పరిహారం చెల్లించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, కొత్తూరు మండలం పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ చింతాడ సూర్య నారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని మదనాపురం, సోమరాజపురం, అంగూరు, శోభనాపురంతోపాటు పలు గ్రామాల్లో నీట మునిగిన వరి పంటను పార్టీ నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. నష్టపోయిన పంటల వివరాలను బాధిత రైతులు సూర్యనారాయణకు వివరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ.. వరి పంటకు ఎకరాకు రూ.50 వేలు, అరటి, చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు ఎకరాకు రూ.లక్ష చెల్లించాలన్నారు. నష్టపోయిన పంటలను వ్యవసాయశాఖ అధికారులు తక్షణమే పరిశీలించి వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ యర్లంకి ధర్మారావు, శిమ్మ మధుసూదనరావు, మాజీ సర్పంచ్ తిర్లంగి కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం



ట్రాక్టర్‌పై దుర్గాదేవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

సారవకోట: మండల కేంద్రంలో శరన్నావరాత్రులు పురస్కరించుకుని స్వర్ణమణి ఆటో యూనియన్ ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహ నిమజ్జన కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో శోభయాత్ర నిర్వహించి అనంతరం స్థానిక శివరామపాత్రుని కోనేరులో నిమజ్జనం చేశారు.

పోరుబాటను విజయవంతం చేయండి

ఆమదాలవలస: ఈ నెల 7వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించనున్న పోరుబాటను విజయవంతం చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆమదాలవలసలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడారు. బోధన, బోధనేతర, ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు, 12వ పీఆర్సీ ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, కరోనా కాలంలో మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల సాంకేతిక సమస్యలు, సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధాన పునరుద్ధరణ వంటి అంశాల పరిష్కారానికే ఈ ధర్నాను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాకు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆమదాలవలసశాఖ మద్దతును ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు దాస్యం లక్ష్మణరావు, బొడ్డేపల్లి జోగారావు

వరద నీటిలోనే స్టోన్ క్రషర్



స్టోన్ క్రషర్

కొత్తూరు: వంశధార నదికి వచ్చిన వరదల కారణంగా మండలంలోని మదనాపురం గ్రామంలోని సాయిగీత స్టోన్ క్రషర్ నీటిలో మునిగింది. మూడు రోజులు కావస్తున్నా వరద నీరు తగ్గలేదు. దీంతో క్రషర్‌లో పనిచేస్తున్న కూలీలకు పనులు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. యంత్రంలోకి నీరు చేరడంతో విలువైన సామగ్రి పాడైంది. దీంతో స్టోన్ క్రషర్‌ను బాగు చేసేవంతవరకు ఉపాధి ఉండదని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పశు బీమాకు.. ఆదరణ కరువు



బూరగాం గ్రామంలోని పశువులు

- బీమా చేయించుకోవడానికి ముందుకు రాని పాడి రైతులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం



కొరసవాడలో కుక్కల దాడిలో మృతి చెందిన మేకలు (ఫైల్)

పాతపట్నం: పశుపోషణ వ్యవసాయ అనుబంధ రంగంలో ఒకటి. గ్రామీణ ప్రాంతల్లో పశుపోషణపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలు చాలానే ఉన్నాయి. పాడి పశువులు ప్రమాదవశాత్తు, జబ్బు చేసి, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు, విషసర్పాల కాటు వలన, అగ్ని ప్రమాదాల వలన మరణిస్తే ఆ పాడి రైతుకు చాలా నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం పశు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది. పశువులకు బీమా చేయించడానికి చాలామంది రైతులు ముందుకు రావడం లేదు.

20 శాతం రైతులు చెల్లించాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పశు బీమాను అందజేస్తున్నాయి. ఈ బీమా ప్రీమియం మూడేళ్లకు రూ.2 వేలుగా కాగా.. కేంద్ర ప్రభుత్వం రూ.800, రాష్ట్ర ప్రభుత్వం రూ.800 చెల్లిస్తున్నాయి. మిగిలిన రూ.400 రైతులు చెల్లించాలి. అదే గొర్రెలు, మేకకు అయితే కేవలం రూ.20 కడితే మిగిలిన రూ.80 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా చెల్లిస్తాయి. ఒకటి, రెండు పశువులు ఉన్న రైతులు బీమా ప్రీమియం కడుతున్నారు. పదికి పైగా పాడి పశువులు ఉన్న రైతులు ఒక్కసారిగా అంత మొత్తం చెల్లించలేక బీమా కట్టడానికి ముందుకు రావడం లేదు. పాతపట్నం నియోజకవర్గంలో సుమారు 2,07,898 పాడి పశువులు (ఆవులు, గేదెలు), 92,945 గొర్రెలు, మేకలున్నాయి. వీటిలో కేవలం 1,415 పశువులకు మాత్రమే పాడి రైతులు బీమా ప్రీమియం చెల్లించారు. గొర్రెలు, మేకలకు బీమా కట్టడం లేదు.

గ్రామీణ ప్రాంతాల్లోనే ప్రమాదాలు అధికం..

ఏదైనా ప్రమాదం వలన జంతువు మరణిస్తే దేశవాళీ, సంకర జాతి పశువులకు రూ.30 వేలు, నాటు జాతికి చెందిన పశువులకు రూ.15 వేలు, గొర్రె, మేక, పందికి రూ.6 వేల వరకు బీమా వర్తిస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు బీమా అవసరం ఎక్కువగా ఉంటుంది. పాతపట్నం మండలంలోని హరిద్వారం గ్రామంలో ఏడుగురు పాడి రైతులకు చెందిన 13 పశువులు రైలు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందాయి. పాతపట్నం రైల్వే గేటు సమీపంలో కొరసవాడ గ్రామానికి చెందిన ముగ్గురు గొర్రెల పెంపకందారులకు చెందిన మూడు గొర్రెలు మృతి చెందాయి. మరో మూడు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. పాతపపట్నం ఉప్పర వీధికి చెందిన పాడి రైతు గంట్యాడ రాముకు చెందిన రెండు ఆవులు పాతపట్నం సమీపంలోని నీలకంఠేశ్వర ఆలయం వద్ద రైలు ఢీకొని మృతి చెందాయి. ఈ నేపథ్యంలో పాడి రైతులంతా తప్పనిసరిగా ప్రతీ పశువుకు బీమా చేయించడం ఉత్తమమని పశుసంవర్ధకశాఖ అధికారులు వివరిస్తున్నారు.

మార్గదర్శకాలివే..

బీమా చేయించేటప్పుడు రైతు ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు అందించాలి. పాడి పశువులకు బీమా చేసే క్రమంలో ట్యాగ్ వేస్తారు. ప్రమాదవశాత్తు పశువు మరణిస్తే వెంటనే సమీపంలోని సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. ఒకవేళ బీమా చేయించిన పశువులను విక్రయిస్తే పశువును కొనుగోలు చేసిన వ్యక్తి ఏడు రోజుల్లో బీమా కంపెనీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చి బీమా వివరాలు మార్చుకోవాలి.

రైతులు స్పందించడం లేదు



పాడి రైతులు కేవలం 20 శాతం బీమా కడితే మిగిలిన 80 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయి. బీమా కట్టాలని రైతులకు సూచించినా స్పందించడం లేదు. ఒకవేళ పశువు మరణిస్తే అప్పుడు సిఫారసులు చేయిస్తున్నారు. బీమా లేకపోతే ఎవ్వరూ ఏమీ చేయలేరు. రైతులంతా పశువులకు బీమా చేయించుకోవడం మంచిది.

– డాక్టర్ ఎం.కరుణాకరరావు, సహాయ సంచాలకులు, ప్రాంతీయ పశువైద్యశాల, పాతపట్నం

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న సంఘం ప్రధాన కార్యదర్శి బగాది తేజేశ్వరరావు

ఆమదాలవలస: కళాకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బగాది తేజేశ్వరరావు కోరారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పేడాడ ధనుంజయరావు ఆధ్వర్యంలో కళాకారుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన తేజేశ్వరరావు మాట్లాడుతూ.. కళారంగం అభివృద్ధికి, కళాకారుల ప్రదర్శనలు కోసం పట్టణంలో కళా వేదిక (ఆడిటోరియం) నిర్మించాలన్నారు. సంఘ సహాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు మాట్లాడుతూ.. పేద కళాకారులకు ఇళ్ల స్థలాలను ప్రభుత్వం మంజూరు చేయాలన్నారు. కళాకారులకు గుర్తింపుకార్డులను అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఎంఈఓ కళ్లేపల్లి అప్పల రాములు ప్రదర్శించిన డప్పు వాయిద్యం, ఫ్లూట్ వాయిద్యాలు సభను ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమంలో కళాకారుల సంక్షేమ సంఘం కోశాధికారి కొంచాడ రామారావు, కార్యవర్గ సభ్యులు బంకుపల్లి శ్రీరామచంద్రమూర్తి శర్మ, అంపోలు రామాచార్యులు, కూన రాములు నాయుడు, బొడ్డేపల్లి జోగారావు, దాస్యం లక్ష్మణరావు, బొడ్డేపల్లి మోహనరావు, బెండి గోవిందరావు, లోలుగు విశ్వేశ్వరరావు, నాయనపాత్రని వాసుదేవరావు, గంగ్రేటి జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ధర్మాన కృష్ణచైతన్య పిలుపు



నరసన్నపేట: మాట్లాడుతున్న కృష్ణచైతన్య

నరసన్నపేట/పోలాకి: కూటమి ప్రభుత్వం అన్నిరకాలుగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రీజనల్ కో–ఆర్డినేటర్, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. నరసన్నపేట మండలంలోని పెద్దబొరిగివలస క్లస్టర్‌లో, పోలాకి మండలం బెలమరలో ఆదివారం 'కార్యకర్తలతో కృష్ణచైతన్య' కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ..ఎరువుల కోసం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండో విడత సిలిండర్ డబ్బులు ఇప్పటివరకూ పడలేదన్నారు. గతంలో 14 ఏళ్ల అధికారంలో ఉన్న టీడీపీ ఏనాడూ ఆటో డ్రైవర్లకు ఒక్కపైసా కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు ఇచ్చిందంటే అది జగనన్న చలవేనన్నారు. కూటమి పాలనలో ఇంటింటికీ బియ్యం అందజేసే వాహనాలను రద్దు చేశారన్నారు. మందు మాత్రం డోర్ డెలవరీ చేస్తున్నారని ఆరోపించారు. 50 ఏళ్లకు పింఛన్, నిరుద్యోగ భృతి, ఇలా అనేక పథకాలు ఇస్తామని హామీ ఇచ్చి 17 నెలలు అవుతున్నా అమలు చేయడం లేదన్నారు. వీటిపై ప్రజలకు వివరించాలి అని వైఎస్సార్‌సీపీ కార్యర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలా ఉంటామన్నారు. మీ ఇబ్బందులు తెలుసుకోవడానికే ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, ఎంపీటీసీ బగ్గు జగదీశ్వరి, చిన్న బొరిగివలస సర్పంచ్ పొన్నాన ప్రసాద్, పొందర కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ రాజాపు హైమావతి, పార్టీ నాయకులు బగ్గు రమణయ్య, అప్పన్న, సురంగి నర్సింగరావు, లుకలాపు రవి, పోలాకి మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, పార్టీ మండలఅధ్యక్షుడు కణితి కృష్ణారావు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి చింతు రాఘవరావు, పార్టీ మండల బూత్ కమిటీ అధ్యక్షుడు చింతాడ ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ కలగదండు తాతారావు, నాయకులు చింతు సింహాచలం, పైల మల్లేష్, సోషల్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు గౌరీ పౌర్ణమి శోభ



నరసన్నపేట: పండ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు



నరసన్నపేట: కొత్తవీధి కూడలిలో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

నరసన్నపేట/కొత్తూరు: నరసన్నపేట, కొత్తూరు మండల కేంద్రాల్లోని మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. సోమవారం గౌరీ పౌర్ణమి పురస్కరించుకుని భక్తులు ఆదివారం పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. నరసన్నపేటలోని బజారు వీధితోపాటు మెయిన్ రోడ్డు కిటకిటలాడింది. పండ్లు, పూలు ధరలకు రెక్కలు వచ్చాయి. సోమవారం నుంచి నందెన్న ఉత్సవాలు కూడా గ్రామాల్లో ప్రారంభం కానున్నాయి.



కొత్తూరు: కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న కొత్తూరు మార్కెట్

అవార్డుకు ఎంపిక

హిరమండలం: స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర పథకానికి జిల్లా స్థాయిలో చింతలబడవంజ అంగన్‌వాడీ కేంద్రం ఎంపికైనట్లు కొత్తూరు సీడీపీఓ ఉమాజానికి ఆదివారం తెలిపారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళంలో అంగన్‌వాడీ కార్యకర్త సరస్వతి, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ అవార్డు అందజేస్తారని సీడీపీఓ తెలిపారు.

వితరణ..



కంప్యూటర్, ప్రింటర్‌ను ఉపాధ్యాయులకు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలం చింతలబడవంజ ప్రభుత్వ పాఠశాలకు నేతాజీ యువజన సంఘం ప్రతినిధులు కంప్యూటర్‌తో పాటు ప్రింటర్‌ను ఆదివారం పాఠశాల ఉపాధ్యాయులకు అందించారు. సంఘ అధ్యక్షుడు సీర రమేష్‌బాబు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం వీటిని అందించినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇరిగేషన్ డీఈ కొత్తకోట శ్రీకాంత్.. మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు క్రమశిక్షణ అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు లావేటి జనార్దనరావు, సంఘ ప్రతినిధులు కొత్తకోట వెంకటేష్, బొడ్డేపల్లి సత్యనారాయణ, చింతాడ గోవిందరావు, వూట జగన్నాథరావు, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చింత చెట్టు



ఎండిన చింతచెట్టు మొదలు

పాతపట్నం: పాతపట్నం–తెంబూరు రహదారి పక్కన చిన్నలోగిడి ఆంజనేయ ఆలయం వెనుక ఉన్న చింత చెట్టు కూలిపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చిన్నలోగిడి గ్రామం వద్ద తెంబూరు రహదారి పక్కన అనుకొని ఉన్న చింతచెట్టు మొదులు కుళ్లిపోవడంతో ఎప్పుడు కూలిపోతుందోనని గ్రామస్తులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఆంజనేయ ఆలయం వద్ద గ్రామస్తులు కూర్చొని ఉంటారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి చింత చెట్టును తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు అండగా నిలవాలి



మాట్లాడుతున్న ఓబీసీ రాష్ట్ర సెక్రటరీ కృష్ణ రాజు

పాతపట్నం: జిల్లాలోని పేద విద్యార్థులకు చిత్తాడ శ్రీవైష్ణవ సంఘం తరఫున ఆర్థిక సహాయం అందించి అండగా ఉండాలని ఓబీసీ రాష్ట్ర సెక్రటరీ, జిల్లా రైల్వే బోర్డు మెంబర్ టి.కృష్ణ రాజు అన్నారు. మండలంలోని బూరగాం సత్యనారాయణస్వామి మందిరంలో మండల చిత్తాడ శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ రాజు మాట్లాడుతూ వైష్ణవ సంఘంలో ఉండే ప్రతి ఒక్కరూ పేద విద్యార్థులకు అండగా నిలవాలన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు వి.మురళీకృష్ణ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ కోనేటి మోహన్‌రావు, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై అంధకారం



కొత్తూరు మండలంలోని మాతల–నివగాం (వంశధార నదిపై) వంతెన అంధకారంలో ఉంది. వంతెనపై విద్యుత్ దీపాలు చాలా రోజుల క్రితం పాడయ్యాయి. ప్రయాణికులు రాత్రి వేళల్లో ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నదికి వరదనీరు పోటెత్తింది. ప్రమాదాలు జరగక ముందే ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనపై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- కొత్తూరు

ఇది కోతల ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి



హిరమండలం: ఇది కోతల ప్రభుత్వమని.. పథకాల పేరుతో లబ్ధిదారుల సంఖ్యను కోత పెడుతోందని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఆదివారం పాతపట్నంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉంటే 2.90 లక్షల మందికి మాత్రమే ఆటో డ్రైవర్ల సేవ పథకం అందించారన్నారు. నిబంధనల పేరుతో లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేశారని ఆరోపించారు. చేతికి బ్యాడ్జీ ఉన్న డ్రైవర్లందరికీ పథకం అమలుచేస్తామని చెప్పి దారుణ వంచనకు పాల్పడ్డారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నుంచే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాహనమిత్ర పథకం అమలుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. కేవలం మాయమాటలతో ఆటో కార్మికులను తన వైపు తిప్పుకునేందుకే చంద్రబాబు ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ చర్యలను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటోడ్రైవర్ల అసహ్యించుకుంటున్నారన్నారు. మరోవైపు రహదారుల విషయంలో సైతం మాట తప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారులను అద్దంలా మెరిపిస్తామని చెప్పి.. వాటి విషయాన్నే మరిచిపోయారన్నారు. గోతుల్లో ఆటోలు బోల్తాపడి తీరని నష్టం కలుగుతోందన్నారు. రాష్ట్రంలో అర్హులైన 15 లక్షల మంది ఆటో డ్రైవర్లకు నగదు సాయం చేయాల్సిందేనన్నారు. లేకుంటే వారికి అండగా వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు.

గురువులు నవసమాజ నిర్మాతలు



పాతపట్నం: హెచ్ఎం వైకుంఠరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



కొత్తూరు: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రామరాజు చారటబుల్ ట్రస్టు సభ్యులు

పాతపట్నం: ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రే కీలకమని, సమాజంలో గురువు ప్రాధాన్యత ఎంతో గొప్పదని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.వైకుంఠరావు అన్నారు. ఉన్నత పాఠశాలలో ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎంను ఉపాధ్యాయులు సత్కరించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్.టి.రామారావు, బి.వి.రమణ, కోటి, విజయ్, రామలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: నేటి సామాజానికి ఉపాధ్యాయులే సమాజమార్గ దర్శకులని ఎంఈఓ ఎస్.శ్రీనివాసరావు, రామరాజు చారటబుల్ ట్రస్టు చైర్మన్ పారిశిల్లి రామరాజు, ఎద్దు సుందరనారాయణ, వరహాలమ్మ చారటబుల్ ట్రస్టు చైర్మన్ ఎద్దు గోపాలదాసు నాయుడు అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఉపాధ్యాయులను సన్మానించారు.

సమాజహితమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

హిరమండలం: సమాజహితం కోసమే ఆర్ఎస్ఎస్ ఏర్పడిందని సంఘ ప్రతినిధులు అన్నారు. ఆర్ఎస్ఎస్ శత వసంతాల కార్యక్రమాన్ని హిరమండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ ప్రేరక్‌లు హాజరయ్యారు. ఆర్ఎస్ఎస్ భావజాలంపై అవగాహన కల్పించారు. విజయదశమి ఉత్సవాలను నిర్వహించారు. హిరమండలం మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి రామకృష్ణ, విభాగ్ సంపర్క్ ప్రముఖ్ కిశోర్‌కుమార్ పాత్రో, బీజేపీ మండల అధ్యక్షుడు ఆర్.డిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు..



ఆలయంలో క్యూలో భక్తులు



ఆలయం ముందు వాహనాలకు పూజలు చేస్తున్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాతపట్నం గ్రామ దేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. దసరా రోజు వర్షం కురిసింది. దీంతో అమ్మవారి ఆలయానికి తెల్లవారు జామునుంచే స్థానికులతో పాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి కుంకుమ, ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలతో మొక్కులు చెల్లించారు. వాహనాలకు పూజలు చేశారు.

అరకొరగా బస్సులు..

- ప్రయాణికుల పాట్లు



శ్రీకాకుళం వైపు వెళ్లేందుకు బస్సు వద్ద ప్రయాణికుల హడావుడి



నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ



పాతపట్నం వైపు వెళ్లే బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

నరసన్నపేట: ప్రయాణికులకు తగ్గట్టుగా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. వచ్చిన బస్సులు ఎక్కేందుకు యుద్ధాలే చేయాల్సి వస్తోంది. సోమవారం గౌరీ పౌర్ణమి సందర్భంగా నరసన్నపేట పట్టణం ఆదివారం కిటకిటలాడింది. నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ కనిపించింది. ప్రధానంగా మహిళా ప్రయాణికులు అధిక సంఖ్యలో ఉన్నారు. టెక్కలి, పాతపట్నం, శ్రీకాకుళంతోపాటు నరసన్నపేట పరిసర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ప్రయాణికుల సంఖ్య పెరిగిన మేరకు బస్సు సర్వీసులు కూడా అదనంగా వేయాలని కోరుతున్నారు.